క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

నరసన్నపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు అన్నారు. స్థానిక సివిల్ జడ్జి ఎస్.వాణి సూచనల మేరకు న్యాయవాదులు శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ, న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగవారికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయవద్దని సూచించారు. ఇప్పటికీ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు జామి కామేశ్వరరావు, మధు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



గోదాములో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పాతపట్నం: మండల కేంద్రంతో పాటు కొరసవాడ గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. షాపుల్లో స్టాక్ రిజిస్ట్రార్, బిల్లు పుస్తకాలు, దస్త్రాలు, గోదాముల తనిఖీ చేపట్టారు. హోల్‌సేల్, రిటైల్ అమ్మకాల పత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదోనని శ్రీకాకుళం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్ కుమార్, వ్యవసాయాధికారి కిరణ్ వాణి పరిశీలించారు. డీలర్లు రసాయనిక ఎరువులను ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



జాగిలాలతో షాపుల్లో తనిఖీలు చేపడుతున్న దృశ్యం

మెళియాపుట్టి: ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్ బాబు హెచ్చరించారు. మండలంలోని వసుంధర, చాపర, జాడుపల్లి, మెళియాపుట్టి గ్రామాల్లోని కిరాణా షాపులు, పాన్ షాపులు, ఇతర ప్రదేశాల్లో నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు గుర్తు పట్టడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలాలతో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత భవిష్యత్‌ను నాశనం చేస్తూ, అక్రమార్జనే ధ్యేయంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతోపాటు సిబ్బంది ఉన్నారు.

పారిశ్రామిక అభివృద్ధితోనే ప్రగతి



భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పారిశ్రామిక అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవనాల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో సైన్స్ కోర్సులతో పాటు డిగ్రీ కళాశాల భవనాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, పీఏసీఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి, ఎన్టీఆర్ వర్సిటీ డైరెక్టర్ చాపర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

బూర్జ: కూటమి ప్రభుత్వం రైతులకు సరిపడిన ఎరువులు సరఫరా చేసి ఆదుకోవాలని తోటవాడ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలో భాగస్వామిగా ఉంటూ ఎరువుల కొరత అంశాన్ని రాష్ట్ర పాలకులు కేంద్ర ప్రభుత్వంపై నెట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే, మిగతా జిల్లాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. రైతులను ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ తరుపున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

రైతు సేవలకు గ్రహణం



పెద్దసీది రైతుసేవా కేంద్రం

- వెలవెలబోతున్న ఆర్‌ఎస్‌కేలు
- మూలకుచేరిన కియోస్క్ యంత్రాలు
- అరకొరగా ఎరువులు, పురుగు మందుల పంపిణీ
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



హిరమండలం ఆర్‌ఎస్‌కేలో మూలకుచేరిన కియోస్క్ డిజిటల్ యంత్రం

పాతపట్నం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, అనుబంధ రంగ వస్తువులు రాయితీపై అందజేయడంతో పాటు సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు అందించేవారు. ప్రతీ ఆర్‌బీకేలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేయడంతో రైతులే నేరుగా ఎరువులు, పురుగు మందులకు ఇండెంట్ పెట్టుకునేవారు. ప్రతిరోజూ రైతుల రాకపోకలతో రైతు భరోసా కేంద్రాలు కళకళలాడేవి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. కానీ రైతులకు ఎటువంటి సేవలు అందించకపోవడంతో ఆయా కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. కొన్ని నెలలుగా రైతుసేవా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కియోస్క్ యంత్రాలు ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తాయి. ఎరువులు, పురుగు మందులు, ఇతర వస్తువులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే సౌకర్యంతో పాటు పంట యాజమాన్య పద్ధతులపై సమాచారాన్ని వీడియో రూపంలో పొందవచ్చు. వాతావరణ సూచనలు, ఏ సమయంలో ఏ పంట వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు తెలియజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించకపోవడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఎరువులు సక్రమంగా రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అందువలన పాలకులు, అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నియోజక వర్గంలో ఆర్‌ఎస్‌కేలు	మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	కొత్తూరు	హిరమండలం	ఎల్.ఎన్.పేట
	రైతుసేవా కేంద్రాలు	18	21	27	13	12
	కియోస్కో యంత్రాలు	18	21	27	13	12

ఎరువులైనా అందించాలి



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులైనా పూర్తిస్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందించలేదు. దీంతో ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నాం. గతంలో ఆర్‌బీకేలు బాగా పని చేసేవి. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

– గోకవలస రాము, కాపువీధి, పాతపట్నం

వినియోగంలోకి తీసుకు రావాలి



గతంలో రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ విధానంలో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం తెలియజేసేవారు. అలాగే ఇప్పుడు కూడా కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– మురళీ అప్పో, సీతారాంపల్లి గ్రామం, పాతపట్నం

పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేద్దాం



నాయకులను సత్కరిస్తున్న రవికుమార్ తదితరులు

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరం సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పార్టీ కార్యాలయంలో ఇటీవల వివిధ పార్టీ విభాగాల్లో నియమితులైనవారిని శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పార్టీ ముఖ్య నాయకులు దుంపల చిరంజీవిరావు, రామ్మోహన్‌రావు, సైలాడ దాసునాయుడు, చలపతిరావు, బీవీ రమణమూర్తి, నున్నగాపుల చిన్నారావు, ఎస్.రామారావు, గోవిందరావు, చింతాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతాయ నమః

జిల్లావ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. లడ్డూ వేలంపాటల్లో ఆసక్తి ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజా మండపాల వద్ద చేపట్టిన దీపారాధనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: తిమడాంలో దీపారాధన చేపడుతున్న దృశ్యం



పొందూరు: గోరింట గ్రామంలో వేలంపాటలో కైవసం చేసుకున్న లడ్డూతో వెంకటరావు



కొత్తూరు: నివగాం రోడ్డులో అన్నప్రసాద వితరణ



హిరమండలం: మెండవీధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



నరసన్నపేట: కొత్తవీధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో పూజల్లో పాల్గొన్న నాయకులు

పాగోడులో క్విజ్ పోటీలు

జలుమూరు: మండలంలోని పాగోడు గ్రామంలో వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దామ మన్మథరావు, పట్ట వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



అంబులెన్స్‌లో రికార్డులు పరిశీలిస్తున్న చిన్నబాబు

పాతపట్నం: అత్యవసర సమయాల్లో 108 సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని 108 పలాస డివిజన్ అధికారి కె.చిన్నబాబు అన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనం పనితీరు, మెడికల్ పరికరాలు, ఎమర్జెన్సీ డ్రగ్ రికార్డు, సిబ్బంది రికార్డుల నిర్వహణ పరిశీలించారు. ఆయనతో పాటు మెడికల్ టెక్నీషియన్ కె.అఫీస్, పైలట్ డి.రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల వస్తువుల ధ్వంసంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, ప్రజలు

హిరమండలం: ఎల్ఎన్‌పేట మండలం కొమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో చొరబడి పాఠశాల ఆస్తులను ధ్వంసం చేసినట్లు పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ చలపతిరావుతో పాటు గ్రామస్తులు శుక్రవారం సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో మద్యం సేవించి పాఠశాలకు ఆస్తులు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



నగదు బహుమతులతో విద్యార్థులు

సారవకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన సీవీ కృష్ణారావు కుమారుడు రాంగోపాల్, కోటబొమ్మాళికి చెందిన ఎల్.శ్రీనివాసరావులు ఎంఈవో ఎంవీ రమణ, హెచ్‌ఎం రామకృష్ణ చేతులమీదుగా ప్రోత్సాహకాలు అందజేశారు.

తెలుగు భాష అమృత సమానం



పొందూరు: మలకాం ఎంపీపీఎస్ స్కూల్‌లో సాంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

తెలుగు భాష అమృతం వంటిదని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. - సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: రావులవలస ప్రాథమికోన్నత పాఠశాలలో...



పాతపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది



హిరమండలం: కేజీబీవీలో గిడుగు చిత్రపటానికి నివాళులు



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...



జలుమూరు ప్రాథమిక పాఠశాలలో...



హిరమండలం: ఎల్ఎన్‌పేట కోవిలాం పాఠశాలలో...



కొత్తూరు: రచయితల వేదిక ఆధ్వర్యంలో...

ఘనంగా క్రీడా దినోత్సవం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రికెట్ సబ్ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ-2 శంకరరావు, క్రికెట్ కమిటీ మాజీ సభ్యుడు గొద్దు చిట్టిబాబు, కోచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోతీరాణి, తెలుగు ఉపాధ్యాయిని సుభాషిణిలను సత్కరించారు.

హిరమండలం: హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీ, పీటీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు.



హిరమండలం: గులుమూరు జెడ్పీహెచ్ పాఠశాలలో హాకీ స్టిక్ ఆకారంలో విద్యార్థులు



హిరమండలం: కేజీబీవీలో స్పోర్ట్స్ డే ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన



నరసన్నపేట: జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా దినోత్సవ వేడుకలు

ఫ్యాన్లు వితరణ



హెచ్‌ఎం నిర్మాలాదేవికి ఫ్యాన్లు అందజేస్తున్న ప్రసాదరావు

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సాయం అవసరమని చల్లవానిపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి అన్నారు. శుక్రవారం ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి బి.ప్రసాదరావు సుమారు రూ.10 వేలు విలువ చేసే ఐదు ఫ్యాన్లు పాఠశాలకు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువు కరువు..!



ఎల్ఎన్‌పేటలో ఇటీవల యూరియా కోసం ప్రైవేటు దుకాణం వద్ద బారులుతీరిన రైతులు

- రైతులకు తప్పని యూరియా కష్టాలు
- దృష్టి సారించని పాలకులు
- ప్రైవేటు దుకాణాల వద్ద బారులు

హిరమండలం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరుమార్చి, వాటి ద్వారా అందిస్తున్న సేవలను నిలిపివేయడంపై రైతులు బగ్గుమంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు మొదలైనప్పటి నుంచి ఏదో ఒక సమస్య వెంటాడుతూనే ఉంది. సాగుకు సన్నద్ధమైనప్పుడు రైతులకు అవసరమైన విత్తనాల సమస్య వెంటాడింది. కాగా ఇప్పుడు యూరియా సమస్య కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం సేవా కేంద్రాల్లో ఎరువులు సక్రమంగా అందుబాటులో ఉండడం లేదు. రైతుకు ఒక్క యూరియా బస్తా దొరకడమే కష్టంగా మారింది. దీంతో గత్యంతరం లేక బయట దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల్లో ఎరువులు, పురుగు మందులు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేయడంతో రైతులకు రవాణా ఖర్చులు, అధిక ధరలు, శ్రమ లేకుండా సేవలు అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

దృష్టి సారించని ప్రభుత్వం

రైతులు ఖరీఫ్ వరి సాగులో ఎక్కువగా యూరియాను వినియోగిస్తుంటారు. గతంలో ఆర్‌బీకేల్లో ఒక్క యూరియా బస్తా ధర రూ.266లు చొప్పున, రైతులకు సరిపడా యూరియా అందించేవారు. ఖరీఫ్ సీజన్ వచ్చేసరికి రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నదాత సుఖీభవ పథకం అందరికీ సక్రమంగా అందలేదు. ఇప్పటివరకు అందని రైతులకు ఆర్థిక సాయం ఎప్పుడు అందుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. రైతు అప్పుల చేసి వ్యవసాయం చేస్తుంటే కనీసం రైతులకు సరిపడా ఎరువులు అందించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇదేమీ పట్టించుకోకుండా మౌనం దాల్చడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉంచాలి



రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచడం వలన రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. బయట మార్కెట్‌లో యూరియా కొనాలంటే అధిక ధరలు చెల్లించాల్సి వస్తోంది. ట్రాన్స్‌పోర్టు ఖర్చుల రూపంలో అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా ఆర్‌ఎస్‌కేల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి.

– ముద్దాడ లక్ష్మణరావు, రైతు, దబ్బపాడు

అధిక భారం పడుతోంది



గతంలో రైతుసేవా కేంద్రాల్లో యూరియా కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం అక్కడ యూరియా లేదని చెబుతున్నారు. బయట దుకాణాల్లో అవసరం లేని దుబ్బ గుళికలు అంటగడుతున్నారు. దీంతో రైతులకు అదనపు భారం పడుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రాయి వెంకటరావు, రైతు, మహాలక్ష్మీపురం